క్లుప్తంగా

శ్రీరామ నవమి ఉత్సవాలకు పందిరిరాట


పందిరిరాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం పందిరిరాటను వేశారు. ఆలయ ఈవో పి.గురునాథరావు, అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పందిరి వేసేందుకు రాట మూహూర్తం చేసి పూజలు నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తామని ఈవో చెప్పారు.

జగన్నాథస్వామికి పానకం భోగం సమర్పణ


స్వామికి పానకాన్ని నివేదిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: ఇలిసిపురం జగన్నాథస్వామికి మేష సంక్రమణం సందర్భంగా పానకం భోగ సమర్పణ సోమవారం జరిగింది. పూజలు అనంతరం పానకం అందరికీ వితరణ చేశారు. కార్యక్రమంలో పూజారి సుభాష్ చంద్ర పండా, ఓరియా బ్రాహ్మణులైన బాలు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య


నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.సిగడాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేం సిద్ధం బస్సు యాత్రలో ఆయనపై దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భారీ ర్యాలీ చేపట్టారు. మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో విద్యుత్ కోత అమలు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఆపరేషన్స్ ఎస్.భయ్యన్ననాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముద్దాడ, ధర్మవరం, కొంగరాం, పెద్దకొంగరాం, రామజోగిపేట, ఫరీదుపేట, ఎచ్చెర్ల, ఎస్ ఎంపురం, లింగాలపేట గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.


నీ ఓటు.. నీ భవిష్యత్



ర్యాలీలో పాల్గొన్న ఏపీఎం, మహిళా సంఘాల సభ్యులు

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని అబోతులపేట గ్రామంలో ఐకేపీ ఏపీఎం రెడ్డి రామకృష్ణనాయుడు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో సోమవారం ర్యాలీ నిర్వహించి ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ బూత్‌లో 85 శాతం పోలింగ్ నమోదు అయ్యేలా కృషి చేయాలని ఓటర్లను కోరారు. అనంతరం మానవహారం చేపట్టారు. సంఘం అధ్యక్షురాలు ఎ.కుమారి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణం


రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామం నుంచి విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరి వరకు బీటీ రోడ్డు పనులు శరవేగంగా చేపడుతున్నారు. రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు రహదారి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడులు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు


మంత్రి ధర్మాన ప్రసాదరావుకు హారతులిస్తున్న హడ్కోకాలనీ మహిళలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమ రథసారధుడు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు దాడులు చేయిస్తున్నాయని శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దుర్మార్గపు పనులు చేస్తే ఆదరిస్తారనుకోవడం సరికాదన్నారు. శ్రీకాకుళం నగరంలో 47వ డివిజన్ ఇన్‌చార్జి ఆబోతుల రామ్మోహన్ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. రూ 3.50 కోట్లతో రోడ్లు వేయించింది ధర్మాన ప్రసాదరావు అని పార్టీ నాయకులు చెప్పారు. ధర్మాన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకి ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సమాజంలో అంతరాలు తొలగించి, పేదరికాన్ని పారద్రోలాలనే దృఢసంకల్పంతో ఐదేళ్లలో పాలన చేశామన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు రాలేదని.. నిరంతరం ప్రజల మధ్యే ఉంటున్నామన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో ప్రజలందరికీ మంచి జరిగి ఉంటే ఓటేయ్యండని.. లేకుంటే వద్దని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఇంటివద్దకే సేవలందించే పరిస్థితి లేకుండా చంద్రబాబు ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేసి శునకానందం పొందుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించారన్నారు. జిల్లాకు ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ జరిగేలా మూలపేట నిర్మాణం చేపట్టామని, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, హిరమండలం లిఫ్టిరిగేషన్ వంటి అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇవన్నీ అభివృద్ధి పనులు కాదా.. కూటమికి ఇవన్నీ కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రిమ్స్ ఆస్పత్రి ఏర్పాటు, పొట్టి శ్రీరాములు మార్కెట్ అభివృద్ధి, పట్టణ ప్రజలకు రెండు పూటలా నీటిని అందిస్తున్నామని గుర్తుచేశారు. హడ్కో కాలనీ నుంచి ఎప్పుడు మెజార్టీ ఇస్తున్నారని.. ఈ ఎన్నికల్లో కూడా అత్యధిక మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో హడ్కోకాలనీ యువ నాయకుడు కల్లేపల్లి బిందుసాగర్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు ఎం.వి.పద్మావతి, ఎం.వి.స్వరూప్, సాధు వైకుంఠరావు, అంబటి శ్రీనివాసరావు, కోణార్క్ శ్రీను, కోటిపల్లి మోహన్, సుంకరి కృష్ణ, షావుకారి నాగేశ్వరరావు, ఎన్ని ధనుంజయరావు, ఎం.ఎ.రఫీ, సిరాజుద్దీన్, గుంట జ్యోతి, ఆలుగుబెల్లి నాగభూషణరావు, కొండాల గణేష్, లుకలాపు గోవిందరావు, ఎం.ఎ.బేగ్, శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మంత్రి ధర్మాన హయాంలోనే మార్కెట్ అభివృద్ధి

- ఎంపీ రామ్మోహన్‌నాయుడు చేసింది శూన్యం
- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి


మాట్లాడుతున్న ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మంత్రి ధర్మాన ప్రసాదరావు హయాంలోనే శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్ అభివృద్ధి జరిగిందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. నగరంలోని టౌన్ హాల్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో పర్యటించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు తమ హయాంలోనే మార్కెట్ అభివృద్ధి జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐడీఎస్ఎంటీ స్కీమ్ నిధులతో మార్కెట్‌ను అభివృద్ధి చేశామని వివరించారు. ఆ సమయంలో నిధులు సరిపోకపోవడంతో మంత్రి ధర్మాన సహకారంతో నిధులు ప్రభుత్వం నుంచి తెప్పించుకుని మార్కెట్ పనులు పూర్తిచేశామన్నారు. టీడీపీ హయాంలో మున్సిపల్ మంత్రిగా ఉన్న నారాయణ మార్కెట్‌లో పర్యటించి అభివృద్ధి చేస్తామని చెప్పి కాలయాపన చేశారే తప్పితే ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి ధర్మాన ప్రసాదరావు నేల దుకాణదారులు, కిరాణా వర్తకులతో మాట్లాడి వారికి అవసరమైన మేరకు సీసీ రోడ్లు, దుకాణాలు నిర్మించి అందజేశారన్నారు. మార్కెట్ అభివృద్ధిలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు పాత్ర లేదని స్పష్టం చేశారు. టీడీపీలో నియోజకవర్గంపై పూర్తి అవగాహన లేని వ్యక్తిని అసెంబ్లీకి పంపించి దాని ద్వారా తాను గెలవాలని, అతని గెలిపించాలన్న ఆలోచన సరికాదన్నారు. ఏ రోజైనా ఎంపీ మార్కెట్‌కు వచ్చిన సందర్భమే లేదన్నారు. ఏదైనా తెలుసుకొని మాట్లాడాలని, లేదంటే అడిగి తెలుసుకోవాలి తప్పితే అవగాహన లేని మాటలు ఎందుకని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి ప్రదాత ధర్మాన ప్రసాదరావు అని చెప్పారు. జిల్లాలో అంబేడ్కర్ యూనివర్సిటీ, రిమ్స్ ఆస్పత్రి, 80 ఫీట్ రోడ్డు, నాలుగు వంతెనలతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత ధర్మానకే దక్కుతుందని చెప్పారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు గత ఎన్నికల సమయంలో కనిపించారు... మరలా ఇప్పుడే కన్పిస్తున్నారని చెప్పారు. ఇంతకాలం ఏమయ్యారని ప్రశ్నించారు. జిల్లా ఎంపీగా ఉన్న ఆయన చేసిన ఒక్క మంచి పనైనా చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. నగరంలోని ఏమూల చూసినా ధర్మాన హయాంలో జరిగిన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకునేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు దాడులకు దిగుతున్నారన్నారు. త్వరలోనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ చల్లా అలివేలు మంగ, మాజీ కౌన్సిలర్లు ఎంఏ రఫీ, బలగ పండరీనాథ్, ధర్మాన రఘునాథమూర్తి, సుంకరి కృష్ణ ఉన్నారు.

మాయమాటలు నమ్మకండి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్‌మనోహర్ నాయుడు


గార: వేతనదారులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

గార: ఎన్నికల నేపథ్యంలో మాయమాటలు చెప్పేందుకు కూటమిగా వస్తున్న నాయకులను నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావు, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. బూరవెల్లి, కొర్ని గ్రామాల్లో సోమవారం పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ వేతనదారులతో ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్, మంత్రి ధర్మాన ప్రసాదరావుల హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ కన్వీనర్ పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, మళ్ల నారాయణ మూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజశ్యామల యాగం


రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ దంపతులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజల యోగక్షేమాలను ఆకాంక్షించి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆయన సతీమణి పరిమళ రాజశ్యామల యాగం చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గత మూడు రోజులగా వేదపండితుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మానను గెలిపించండి


గూడెం గ్రామం వద్ద వేతనదారులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ధర్మాన ప్రసాదరావుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ధర్మాన రామ్మనోహర్‌నాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గూడేం గ్రామంలో ఉపాధి వేతనదారులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పేదవాడి సంక్షేమాభివృద్ధి కోరుకున్న పార్టీ అయితే..టీడీపీ పెత్తందారులకు వత్తాసు పలికిన పార్టీ అన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందేలా ముఖ్యమంత్రి జగన్ పాలన చేశారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ధర్మాన ప్రసాదరావును గెలిపించాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భర్త తరఫున భార్య ప్రచారం


ప్రచారంలో ధర్మాన సతీమణి గజలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు తరఫున ఆయన సతీమణి గజలక్ష్మి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా వప్పంగి గ్రామంలో రెండు రోజైన సోమవారం కూడా ఇంటింటా ప్రచారం చేసి ఎమ్మెల్యేగా ప్రసాదరావును గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, రుప్ప అప్పలసూరి, ఎచ్చెర్ల శ్రీధర్ ఉన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాల్లో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న పంచాయతీరాజ్ రీసోర్స్‌పర్సన్ రాజేష్

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ రీసోర్స్ పర్సన్ కె.రాజేష్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో పంచాయతీల కార్యాచరణ ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం వంటి పూర్తిస్థాయి అంశాలతో నివేదిక అందజేయాలని సూచించారు. ప్రధానంగా గ్రామంలో ఉన్న అవసరాలు, సమస్యలు ఆధారంగా నివేదికలు అందజేయాలన్నారు. ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, ఇతర నిధులు వినియోగించి, పంచాయతీలు పూర్తిస్థాయిలో అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా తీగునీరు, పారిశుద్ధ్యం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రీసోర్స్ పర్సన్ జ్యోతి శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కె.ఈశ్వరి, పరిపాలన అధికారి పూజారి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆదరించండి


దేరసాంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనతో ఎంతో మంది పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని దేరసాం పంచాయతీలో ఉపాధి హామీ వేతనదారులతో జగనన్న సంక్షేమ పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఇంటికే సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తుచేశారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ను, సీఎం జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకట రెడ్డి, దేరసాం సర్పంచ్ మీసాల రామారావు, గ్రామ నాయకులు దన్నాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన యువకులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం పంచాయతీ మునసబుపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. పెదపాడులోని మంత్రి క్యాంప్ వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో వీరికి ధర్మాన ప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బగ్గు అప్పారావు, రంధి రాజారావు ఉన్నారు.

పలుచోట్ల ప్రతిష్ఠా ఉత్సవాలు


చిం దత్తక్షేత్రంలో నాగేంద్ర ప్రతిష్ఠ పూజలు


గుజరాతీపేటలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు చోట్ల ప్రతిష్ఠా ఉత్సవాలు సోమవారం జరిగాయి. నాగావళి బ్రిడ్జి ఒడ్డున ఉన్న చిం దత్తనాథక్షేత్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన నాగేంద్రస్వామి వారి ఆలయ ప్రతిష్ఠా ఉత్సవం సోమవారం జరిగింది. ప్రధాన అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అలాగే యాగశాల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఐ.సింహాచలం దంపతులు, ట్రస్టు అధ్యక్షులు గవర గోవిందరావు, సభ్యులు వాసుదేవరావు, మాతృమండలి సభ్యులు ఉమాదేవి, శారద పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

గుజరాతీపేటలోని జగన్నాథస్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత రామలింగ పునః ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ అనువంశ అర్చకులు పెంట వంశీయులు యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, భక్తుల దర్శనం జరిగాయి. ఈ నెల 17న సీతారాముల కల్యాణ ఉత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్యామలరావు, ఆలయ ధర్మకర్త రాజేశ్వర భట్, పెంట సత్యన్నారాయణశర్మ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ సూచించారు. మండల కేంద్రంలోని అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో, థియేటర్ వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. రసాయనిక ప్రమాదాలు, అధికంగా మండే గుణం ఉన్న పెట్రోల్, డీజిల్, అయిల్ వంటి ద్రవ పదార్థాలు మండేటప్పుడు ఫోమ్‌ను వినియోగించాలన్నారు. థియేటర్‌లో అగ్నిమాపక పరికరాల ఎలా వాడాలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన తరఫున రాఘవరెడ్డి ప్రచారం



వైఎస్ జగన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, వైఎస్ జగన్ సేవాసమితి చైర్మన్ కూనం రాఘవరెడ్డి సోమవారం శ్రీకాకుళం వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలో హడ్కోకాలనీ ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని ప్రజాదరణను చూసి ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

సమయపాలన తప్పనిసరి

ఎచ్చెర్ల: ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించాలని ఏపీఓ శోబారాణి తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. 10,877 మంది వేతనదారులు పనిచేస్తున్నారని తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పనిచేయాలన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు 3 వందల వరకే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. పని వద్ద మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు.